బతుకమ్మ



# రియన్స్ కాలేజ్ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరపాలి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బానోత్ రఘురాం




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : రియన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో జరిగిన ఘటనపై నిష్పక్షపాత న్యాయ విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి బానోత్ రఘురాం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఘటనకు సంబంధించి విద్యార్థి సంఘాల నాయకులపై నమోదు చేసిన కేసులను తీవ్రంగా ఖండించారు. నిజామాబాద్ 4వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రియన్స్ కాలేజ్ ఘటనలో కేసులు నమోదు చేసే ముందు పోలీసులు సంబంధిత సీసీటీవీ ఫుటేజ్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం మాత్రమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రఘురాం అన్నారు. అయితే కాలేజీ యాజమాన్యం ఇచ్చిన ఏకపక్ష సమాచారాన్ని ఆధారంగా చేసుకుని విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు నమోదు చేయడం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనతో ఏఐఎస్ఎఫ్ కు ఎలాంటి సంబంధం లేకపోయినా, ఎఫ్ఐఆర్ లో సంఘం పేరును చేర్చి బెదిరింపులు, భౌతిక దాడులకు సంబంధించిన ఆరోపణలు నమోదు చేయడం పూర్తిగా అవాస్తవమని, ఇది అన్యాయమని రఘురాం అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి విద్యా రంగ సమస్యలపై పోరాడుతున్న జాతీయ విద్యార్థి సంఘాలపై తప్పుడు సమాచారం ఆధారంగా కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.రియన్స్ కాలేజ్ ఘటనపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా న్యాయ విచారణ జరిపించి అసలు వాస్తవాలను బయటకు తీసుకురావాలని ప్రభుత్వం, పోలీసు శాఖను ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సంఘానికి ఎలాంటి సంబంధం లేకున్నా ఎఫ్ఐఆర్ లో ఏఐఎస్ఎఫ్ పేరును చేర్చడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని, దీనిపై రియన్స్ కాలేజ్ యాజమాన్యం వెంటనే ఏఐఎస్ఎఫ్ కు బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. అలా చేయని పక్షంలో కాలేజీ యాజమాన్యంపై పరువు నష్టం దావాతో పాటు అన్ని న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని రఘురాం హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం నీట్ ఘటనకు సంబంధించిన కేసుల విషయంలో తీసుకున్న వైఖరిని ప్రస్తావిస్తూ, నిజామాబాద్ రియన్స్ కాలేజ్ ఘటనలో విద్యార్థి సంఘాల నాయకులపై నమోదు చేసిన కేసులను కూడా బేషరతుగా ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలపై తప్పుడు కేసులు నమోదు చేసే ధోరణిని వెంటనే నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుభోద్, జిల్లా కోశాధికారి అనూష, జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు వారానికి ఒక్కసారైనా చేపలను తినిపించాలి.. ఎందుకంటే..



చేపలను వారానికి కనీసం ఒక్కసారైనా తినే పిల్లల్లో మేధో సామర్థ్యం మెరుగ్గా ఉండటంతోపాటు మంచి నిద్ర కూడా లభిస్తుందని ఓ అధ్యయనం వెల్లడించింది. పిల్లల మెదడు అభివృద్ధిలో సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఆహారాలను చిన్నప్పటి నుంచే అలవాటు చేయడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం పెరిగే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. జర్నల్ సైంటిఫిక్ రిపోర్ట్స్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. వారానికి కనీసం ఒకసారి చేపలు తినే పిల్లలు ఐక్యూ పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించే అవకాశముందని గుర్తించారు. అలాగే చేపలను ఎక్కువగా తినే పిల్లల్లో నిద్ర సంబంధిత సమస్యలు కూడా తక్కువగా కనిపించాయని పరిశోధకులు వెల్లడించారు. చేపల వినియోగం నిద్ర నాణ్యతను మెరుగుపరచడం ద్వారా మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపిస్తుందని అధ్యయనం సూచిస్తోంది.

### మెదడు అభివృద్ధికి..

చేపలతోపాటు కొన్ని ఇతర ఆహారాలు కూడా పిల్లల మెదడు అభివృద్ధికి తోడ్పడతాయి. గింజలు, నట్స్‌లో మెదడు ఆరోగ్యానికి అవసరమైన అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా గుమ్మడికాయ గింజల్లో ఉండే జింక్ జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అక్రోట్స్‌లో ఉండే ఒమెగా3 ఫ్యాటీ యాసిడ్లు మెదడు పనితీరును సమర్థవంతంగా కొనసాగించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. బ్లూబెర్రీలు, స్ట్రాబెర్రీలు వంటి బెర్రీ పండ్లు కూడా మెదడు పనితీరును మెరుగుపరచడంలో ఉపయోగపడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. వీటిని క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చడం వల్ల పిల్లల ఆలోచనా సామర్థ్యం, జ్ఞాపకశక్తి మెరుగుపడే అవకాశం ఉంటుంది.

### ఆకుకూరలు కూడా..

ఆకుకూరలు పిల్లలకు అంతగా నచ్చకపోయినా, వాటితో రుచికరమైన వంటకాలు తయారు చేసి ఆహారంలో చేర్చడం మంచిది. వీటిలో ఉండే ఐరన్, విటమిన్ ఇ, విటమిన్ కె, విటమిన్ బి9 (ఫోలేట్) వంటి పోషకాలు మెదడు కణాల అభివృద్ధికి అవసరమవుతాయి. టమాటాల్లో ఉండే లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ మెదడు కణాలు దెబ్బతినే ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే కొత్త మెదడు కణాల ఏర్పాటుకు, వాటి ఆరోగ్యాన్ని కాపాడటానికి కూడా ఇది తోడ్పడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

# పారదర్శక పాలనకు ఆర్టీఐ ఆయుధం

## సంస్థ విస్తరణపై జాతీయ, రాష్ట్ర కమిటీ కీలక నిర్ణయాలు




హైదరాబాద్, బతుకమ్మ : సమాచార హక్కు చట్టం – 2005 సమర్థవంతమైన అమలు, సంస్థ విస్తరణ, ప్రజల్లో అవగాహన పెంపు, ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం బలోపేతం చేసే లక్ష్యాలతో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సమావేశం తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యం వహించారు. సమావేశంలో సమాచార హక్కు చట్టం అమలులో ఎదురవుతున్న సవాళ్లు, సంస్థ భవిష్యత్తు కార్యాచరణ, రాష్ట్రవ్యాప్తంగా సంస్థను గ్రామస్థాయి వరకు విస్తరించడం, ప్రజలకు ఉచిత అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు, న్యాయ, సాంకేతిక మార్గదర్శక సేవలను అందించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఏర్పాటు చేసే సలహా, పర్యవేక్షణ, అధ్యయన ఇతర కమిటీలలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను కోరుతూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలో సంస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ శాఖల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించి, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, "సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తివంతమైన సాధనం. ప్రభుత్వం, సమాచార కమిషన్, ప్రజా సంఘాలు పరస్పర సహకారంతో పనిచేస్తేనే చట్టం లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరతాయి. ప్రజలకు సమాచారం వేగంగా, పారదర్శకంగా అందే విధంగా వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావాలి" అని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి ప్రతి గ్రామానికి సమాచార హక్కు ఉద్యమాన్ని విస్తరించేందుకు కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చింతల రాఘవేందర్, రాష్ట్ర కో–కన్వీనర్ గడప కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, అరవింద్ స్వామి, రాష్ట్ర కార్యదర్శులు రావుల నవీన్ కుమార్, కేడెల ప్రసాద్, మడుపు వేణుగోపాల్ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఏ. శ్రీకాంత్ రెడ్డి, శివకుమార్ గౌడ్, అశోక్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గుడ్డేటి ప్రవీణ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అశోక్, నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు మంద సాయిబాబు తదితర జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం అమలును మరింత బలోపేతం చేయాలంటే ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్, అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజా సంఘాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశం విజ్ఞప్తి చేసింది.

# బీజేపీ పార్టీకి దేశం ముఖ్యం, పదవి కాదు

## అందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా....బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :దేశం ముందు, ఆ తర్వాతే పార్టీ, ఆఖరికే కార్యకర్తలు అనేది భారతీయ జనతా పార్టీ సిద్ధాంతమని, ఆ సిద్ధాంతానికి కట్టుబడే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంలో ఆయన తప్పు ఏమీ లేకపోయినా, నైతిక బాధ్యత వహిస్తూ దేశ ప్రయోజనాల కోసం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని, ఆయన రాజీనామాతో ప్రధాని మోడీ ఓడిపోయారని కొంత మంది దేశ వ్యతిరేక శక్తులు రాక్షసానందం పొందుతున్నాయన్నారు. పాఠ్యాంశాల నుండి అక్బర్, బీర్బల్, మొఘలుల చరిత్రను తొలగించి, ఈ దేశపు గొప్ప మహనీయుల చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చినందుకు ప్రధాని నరేంద్ర మోడీ, ధర్మేంద్ర ప్రధాన్ పై కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తమ అక్కసును వెళ్లగక్కుతున్నారన్నారు. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే ప్రధాని ప్రత్యేక చొరవ తీసుకుని, విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం కోల్పోకుండా వెంటనే తిరిగి పరీక్షలు నిర్వహించేలా ఆదేశించి నిజమైన సత్తా ఉన్న విద్యార్థులకు న్యాయం చేశారన్నారు. ఇటీవల విద్యార్థుల పేరుతో ధర్నాలు చేసిన వారు విదేశీ శక్తుల ధనబలంతో, వారి ప్రేరేపణతోనే ఈ ఆందోళనలు చేశారని, విద్యార్థుల ముసుగులో చేసిన ఈ ఆందోళనల్లో శ్రీరాముడిని, సీతమ్మ తల్లిని, భారతమాతను అవమానించారని మండిపడ్డారు. ఇది విద్యార్థుల ఆందోళనలా కాకుండా భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలా ఉందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన కర్ణాటక, రాజస్థాన్ లతో పాటు కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో పీయూసీ, పీఎస్సీ, గ్రూప్–బి పరీక్షల పేపర్లు లీక్ అయినప్పుడు అక్కడి ముఖ్యమంత్రులు లేదా విద్యాశాఖ మంత్రులు ఎవరైనా రాజీనామా చేశారా ? అని ప్రశ్నించారు. రాజస్థాన్ కాంగ్రెస్ మంత్రి గోవింద్ సింగ్ ను ప్రశ్నిస్తే "నాకేం సంబంధం, అది అధికారుల బాధ్యతని తప్పించుకున్నారని, తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో ఇంటర్మీడియట్, ఎస్ఎస్సి, గ్రూప్–1, 2, 3 పేపర్లు లీక్ అయినప్పుడు ఎవరైనా బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారా ? అప్పటి మంత్రి కేటీఆర్ ను ప్రశ్నిస్తే "ఆ పరీక్షలకు నాకేం సంబంధమని బాధ్యతారాహిత్యంగా సమాధానం చెప్పారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాండిల్ ర్యాలీలు తీయడం విడ్డూరంగా ఉందని, రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్షిప్ లు ఇవ్వనందుకు సిగ్గుపడి ఈ క్యాండిల్ ర్యాలీ తీశారా ? అని ప్రశ్నించారు. 21 సంవత్సరాలకే జెన్ జెడ్ యువతకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలంటున్న సీఎం రేవంత్.. తన మంత్రివర్గంలో ఎంతమంది జెన్ జెడ్ లకు అవకాశం ఇచ్చారో చెప్పాలని, దమ్ముంటే ఆయన రాజీనామా చేసి ఒక జెన్ జెడ్ యువకుడిని ముఖ్యమంత్రిని చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ప్రకాష్ రాజ్.. ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్ని, దేశాన్ని తూట్లు పొడిచిన వారి పక్కనే తిరుగుతున్నారని, గత 12 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోడీ ఒక్క అవినీతి మరక లేకుండా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. దేశం 'వికసిత్ భారత్' దిశగా అడుగులేస్తున్న తరుణంలో దేశ వ్యతిరేక శక్తులు, కమ్యూనిస్టు భావజాలం ఉన్నవారు ఇటువంటి ఆందోళనల ద్వారా దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారని, కానీ దేశ ప్రజలకు నరేంద్ర మోడీ పాలన పైన పూర్తి విశ్వాసం ఉందని గుర్తు చేశారు. ప్రజలంతా ఎల్లప్పుడూ మోడీ వెంటే ఉంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పోతన్ కార్ లక్ష్మీనారాయణ, ప్రమోద్ కుమార్, జ్యోతి, శివ ప్రసాద్, ఓం సింగ్, కిషోర్, రాము, కల్పే అర్చనా, పిల్లి శ్రీకాంత్, విజయ్, పురుషోతం , అన్నం గోపి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.